## మద్దతు ధర కన్నా తక్కువ చెల్లిస్తే మిల్లు సీజ్

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబర్ 11 : ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,320 కంటే తక్కువ రైతులకు చెల్లిస్తే చర్యలు తీసుకుంటామని మిల్లర్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మద్దతు ధర చెల్లించని మిల్లులు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌తోపాటు మార్కెటింగ్, పొల్యూషన్, విద్యుత్ లైసెన్స్ పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కూడా మిల్లులకు పోకుండా ప్రభుత్వ రంగ సంస్థల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

## ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

● ఎస్పీ శరత్ చంద్రపవార్

నీలగిరి, నవంబర్11: మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేట్టు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ మేరకు 110 రైస్ మిల్లుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోళ్ల విషయంలో మోసాలు, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని మిల్లర్లను సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.





ఎంజీయూ ఎదుట మంత్రి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

## మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

రామగిరి, నవంబర్ 11: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్‌వీ నాయకులు నిరసన తెలిపారు. సోమవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎదుట మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించి, అన్ని రంగాల్లో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన కేసీఆర్‌పై నోరు పారేసుకున్న కోమటిరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆందోళనలో బీఆర్‌ఎస్‌వీ ఎంజీయూ అధ్యక్షుడు వాడపల్లి నవీన్, జెట్టి శివప్రసాద్, వల్లమల్ల సూర్యప్రకాశ్, చేదుబుడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని బంగారిగడ్డలోని మంజీత్ ఫైబర్ కాటన్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో సోమవారం పత్తి కొనుగోలు చేయలేదు. దాంతో పత్తిలోడుతో వచ్చిన 60 ట్రాక్టర్లను రైతులు మిల్లు వద్దనే వరుస క్రమంలో ఉంచి నిరాశగా ఇంటి మొహం పట్టారు.

– చండూరు

# మోకా చూసి దోఖా

## మార్కెట్లో రైతన్నకు దక్కని భరోసా

- సిండికేట్ అయ్యి ధర తగ్గించిన మిల్లర్లు
- నిత్యం రోడ్డెక్కుతున్న రైతులు
- పత్తి రైతులదీ అదే పరిస్థితి
- సీసీఐ తీరుతో నిలిచిన పత్తి కొనుగోళ్లు
- జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి రైతుల పడిగాపులు
- కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ
- నేటికీ కొనుగోళ్లపై సమీక్షించని మంత్రులు

ఇటు ధాన్యం కొనుగోళ్లు, అటు పత్తి కొనుగోళ్లలోనూ రైతన్నను అదును చూసి మోసం చేస్తున్నారు. ఒకేసారి మార్కెట్‌కు వస్తున్న పంట ఉత్పత్తులను ఆసరాగా చేసుకుని మద్దతు ధరకు ఎగనామం పెడుతున్నారు. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట రోడ్డెక్కున్నారు. సోమవారం ధాన్యం రైతులు వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద ఆందోళనకు దిగగా, పత్తి రైతులు కొండమల్లేపల్లిలో రాస్తారోకో చేశారు. ఎక్కడైనా మద్దతు ధరకు తమ పంటను కొనుగోలు చేయాలన్నది ఒక్కటే డిమాండ్.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్11(నమస్తే తెలంగాణ)



కొండమల్లేపల్లి : చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో రైతులు రాస్తారోకో చేయడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా వానకాలం ధాన్యం మార్కెట్లను ముంచెత్తుతున్నది. దొడ్డురకాలు ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుండగా, సన్నరకం ధాన్యం నేరుగా రైస్ మిల్లుల వద్దకే వెళ్తున్నది. ఈ సీజన్‌లో సహజంగానే సన్నాలు ఎక్కువగా పండిస్తుంటారు. ముఖ్యంగా సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో మెజార్టీ భాగం రైతులు సన్నాలనే సాగు చేశారు. దాంతో ప్రస్తుతం సన్న వడ్లు ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తున్నాయి. సన్న వడ్లను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మే పరిస్థితి లేదు. అక్కడ 17శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తారు. కానీ సనాల్లో అంత తేమ అసాధ్యం అవడంతో రైతులు నేరుగా రైస్ మిల్లులను ఆశ్రయిస్తున్నారు. అక్కడ కూడా దాదాపు ప్రభుత్వ మద్దతు ధర మేరకు వస్తుందనేది రైతుల భావన. గతేడాది క్వింటా సన్నాలకు రూ.2,800 వరకు ధర పలికింది. ప్రస్తుత సీజన్‌లోనూ రైతులు అదే ఆశాభావంతో మిల్లులకు సన్నవడ్లను తీసుకెళ్తున్నారు. కానీ ధర విషయంతో తీవ్ర అన్యాయం జరుగుతున్నది. వారం రోజుల కిందటి వరకు రూ.2,200 నుంచి రూ.2,400 వరకు ధర చెల్లించారు. ఆ తర్వాత నిత్యం 3 వేలకు పైగా ట్రాక్టర్ల ధాన్యం మిల్లులకు వస్తుండడంతో రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారి సన్నాలకు ధర తగ్గించారు. క్వింటాకు రూ.2,100 నుంచి రూ.2,200 వరకు మాత్రమే చెల్లిస్తామని కరాఖండిగా చెప్తున్నారు. నాణ్యత, తేమ సాకులు చెప్తూ ధర తగ్గిస్తున్నారు. దాంతో రైతులు ఒక్కో కింటాలుపై రెండు, నుంచి మూడు వందల వరకు నష్టపోతున్నారు. అలా కడుపు మండిన రైతులు ఆక్రోశంతో రోడ్లెక్కుతున్నారు. ఆదివారం వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద, మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి వద్ద రైతులు ఆందోళనకు దిగారు. రోడ్లపై బైఠాయించి మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత అధికారులు జోక్యం చేసుకుంటే కొద్దిసేపు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,320కి అటూఇటూగా ధర చెల్లించి కొనుగోళ్లు జరిపారు. సాయంత్రానికి తిరిగి ధరలో తిరకాసు పెట్టారని రైతులు వాపోతున్నారు. సోమవారం మళ్లీ ధర విషయంలో మిల్లర్లు పేచీకి దిగారు. దాంతో మరోసారి రైతులు శెట్టిపాలెం వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై బైఠాయించారు. రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో జాయింట్ కలెక్టర్, మిర్యాలగూడ స్పెషల్ కలెక్టర్ అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయినా సరే రైస్ మిల్లర్లు సరైన ధర చెల్లించేందుకు ససేమిరా అంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం నిత్యం ప్రత్యేక అధికారులతో పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

### గతంలో ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ

గతంలో బీఆర్ఎస్ హయాంలో మద్దతు ధరపై రైస్ మిల్లర్లు పేచి పెడితే కేసీఆర్ సర్కార్ తీవ్రంగా పరిగణించేది. ఏకంగా రైస్ మిల్లుల వారీగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను పర్యవేక్షించింది. ఒక సివిల్ సప్లయ్ అధికారి, రెవెన్యూ, పోలీస్, మార్కెటింగ్, తూనికలు, కొలతల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచేది. రైస్ మిల్లర్లు తేడా చేస్తే కేసులకు సైతం వెనుకాడలేదు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అలా స్పందిస్తున్న దాఖలాలే లేవు. ఇప్పటివరకు జిల్లా మంత్రులు ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేకంగా సమీక్షించ లేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే సివిల్ సప్లయ్ మంత్రిగా ఉన్నా నేటికీ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా అటూవైపు కూడా కన్నెత్తి చూడడం లేదు. నిత్యం రైతులు ఆందోళనలు చేస్తున్నా మంత్రులకు కనీసం పట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### రైతులను పట్టించుకోని ప్రభుత్వం



పత్తి కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రంగా మారింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి ఆంక్షలూ లేకుండా పత్తి కొనుగోలు చేశారు. అప్పట్లో 40ఎకరాల పత్తిని 24 గంటల్లో అమ్ముకొని పోయేవాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వంలో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పత్తి కొనుగోలుపై సీసీఐ కొర్రీల మీద కొర్రీలు పెడుతున్నది.

-ఉంద్ర మాధవరెడ్డి, రైతు, ఈదులూరు (కట్టంగూర్ మండలం)

### పత్తి రైతు చిత్తు

మరోవైపు ఉమ్మడి జిల్లా పరిధిలో చేతికి వచ్చిన పత్తి పంటను అమ్మకోవడం రైతులకు పెద్ద ప్రహసనంగా మారింది. జిల్లాలో 7 సీసీఐ క్లస్టర్లలో 23 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవి కూడా ఆలస్యమవడంతో అప్పటికే తొలిదశలో వచ్చిన నాణ్యమైన పత్తిని రైతులు దళారులకు విక్రయించారు. ఎక్కువ మంది గ్రామాల్లోనే రూ.5,800 నుంచి రూ.6300 వరకు విక్రయించారు. ఆ తర్వాత వస్తున్న పత్తిని అమ్ముకుందాం అంటే సీసీఐ కేంద్రాల్లో సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.7,521 ప్రకటించగా.. తేమ శాతం, ఇతర సాకులతో సీసీఐ అధికారులు కొనుగోళ్లకు నిరాకరిస్తున్నారు. రైతులు తీసుకువచ్చిన పత్తిని వెనక్కి తిప్పి పంపిస్తున్నారు. దాంతో పత్తి రైతులు రోజూ ఎక్కడో ఓ చోట ఆందోళనలు చేస్తున్నారు. మరోవైపు సీసీఐ వ్యవహారం, ప్రభుత్వ తీరుతో విసుగెత్తిన జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. దాంతో సోమవారం జిల్లా అంతటా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద పత్తి లోడ్లతో వచ్చిన వాహనాలు భారీగా బారులు తీరాయి. దాంతో పత్తి రైతులు కొండమల్లేపల్లితోపాటు పలుచోట్ల ఆందోళనకు దిగారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేక అధికారులు పట్టించుకోక అటు వరి, ఇటూ పత్తి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



అవంతీపురం రైస్‌మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడుతున్న జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

## మిల్లులకు అమ్మిన సన్నాలకు బోనస్ ఇవ్వాలి

### జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి

మిర్యాలగూడ రూరల్, నవంబర్11 : సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ హామీ ఇచ్చిన ప్రభుత్వం రైతులు ఎక్కడ విక్రయించినా బోనస్ ఇవ్వాలని రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేసారు. సోమవారం మండలం పరిధిలోని అవంతీపురం, యాద్గార్‌పల్లి రైస్‌మిల్లుల వద్ద ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్న రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సన్న ధాన్యం ఆరబెట్టే పరిస్థితి ఉండదని, ప్రభుత్వం పెట్టిన తేమ శాతం కొర్రీతో నేరుగా రైస్ మిల్లులకు అమ్ముకోవాల్సి వస్తుందని అన్నారు. గత వానకాలం సన్నాలకు క్వింటాకు రూ.2,600 నుంచి 2,700 ధర రాగా, ప్రస్తుతం రూ.2,200కి పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి ఈ పరిస్థితి గమనించి సీఎం దృష్టికి తీసుకువెళ్లి మిల్లుల్లో అమ్మిన ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రైస్ మిల్లులపై రైతు ఫిర్యాదు

మిర్యాలగూడ, నవంబర్ 11 : ధాన్యం కొనుగోళ్లలో అక్రమంగా కోతలు పెట్టి మోసం చేసిన రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. మాడ్గులపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన నామిరెడ్డి శ్రీధర్‌రెడ్డి తాను విక్రయించిన ధాన్యంలో వివిధ రకాలుగా కోత పెట్టి మహర్షి, సూర్య రైస్ మిల్లు యాజమాన్యం తనను మోసం చేశాయని వాపోయాడు. మహర్షి మిల్లుకు ఇటీవల రెండు ట్రాక్టర్ల సన్న ధాన్యాన్ని, యాద్గార్‌పల్లి మండలంలోని సూర్య రైస్ మిల్లులో ఒక ట్రాక్టర్ ధాన్యాన్ని వారు చెప్పిన ధరకు విక్రయించినట్లు తెలిపాడు. హమాలీలు, గుమస్తాలు ఎలాంటి సహకారమూ అందించకపోయినా ధాన్యం డబ్బుల కోసం వెళ్తే హమాలీ ఖర్చు, గుమస్తా రుసుము, సీసీ కటింగ్ అని ఒక శాతం కట్ చేసుకున్నట్లు పేర్కొన్నాడు. ఈ మేరకు క్రిమినల్ కేసు నమోదు చేయాలని వేములపల్లి పోలీసులకు కూడా కంప్లయింట్ చేసినట్లు తెలిపాడు. తనను మోసం చేసిన రైస్ మిల్లుల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరాడు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భువనగిరి అర్బన్, నవంబర్ 11: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్, వాలీబాల్ ఎస్‌జీఎఫ్ అండర్–19 క్రీడా పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ రమణి తెలిపారు. భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం పోటీలు నిర్వహించగా అథ్లెటిక్స్ 800 మీటర్ల రన్నింగ్‌లో ఎన్.నవీన్, వాలీబాల్ బాలుర విభాగం నుంచి ఎం.మధు, ఎస్‌కే జమాల్, బాలికల విభాగం నుంచి టి.శివాణి, బి.దుర్గా భవానీ, కరాటే బాలుర విభాగం నుంచి నర్సింహలు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాపిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

# పొదుపు పైసలు ఫ్రీజ్




## చేనేత పొదుపు డబ్బులు హోల్డ్



- డ్రా చేయకుండా ఆపేసిన బ్యాంకులు
- డ్రా చేసుకోలేకపోతున్న నేతన్నలు
- రుణాలు చెల్లించనందుకే అంటున్న బ్యాంకులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వందలాది కార్మికులు
- పత్తాలేని సర్కారు చేనేత మాఫీ హామీ

పీకల్లోతు కష్టాల్లో ఉన్న నేతన్నకు బ్యాంకులు ఇంకింత గోస పెడుతున్నాయి. నెలనెలా కూడబెట్టుకున్న పొదుపు పథకం పైసలను ఇవ్వకుండా మోకాలు అడ్డుతున్నాయి. లోన్ ఎంఐఎలు కట్టడం లేదని పొదుపు డబ్బులను హోల్డ్‌లో పెట్టాయి. దంతో నేతన్నలు డబ్బుల డ్రా చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అవసరాలకు డబ్బుల కోసం బ్యాంకులను చుట్టూ ప్రదక్షిణలు చేసున్నా తీవ్ర నిరాశతో వెనుదిరగాల్సి వస్తున్నది. ఇంకోవైపు చేనేత రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు హామీ అమలు ఊసే లేదు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ)

నేతన్నల సామాజిక భద్రత కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేనేత పొదుపు పథకానికి శ్రీకారం చుట్టారు. నేత కార్మికుల నెలవారీ ఆదాయంలో 8 శాతం ఆర్డీ 1లో జమ చేసిన తర్వాత.. ప్రభుత్వం ఆర్డీ 2లో 15శాతాన్ని నేరుగా జమ చేస్తుంది. ఆ మొత్తం నగదును వడ్డీ సహా మూడేండ్ల తర్వాత కార్మికులను అందుతుంది. అంతకుముందు 2018–2021లో ఒక దఫా ఈ విధంగా లబ్ధిదారులు సాయం పొందారు. 2021–2024 సంవత్సరానికి గానూ ఆగస్టు 31న పథకం గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పొదుపు పథకం డబ్బులు విడుదల చేసింది.

### చేనేత రుణమాఫీ చేస్తారేమోనని!

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేనేత రుణమాఫీ చేశారు. రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్ కూడా హామీ ఇచ్చింది. ఇటీవల ఫోర్త్ సిటీలో ఐఐహెచ్‌టీ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సైతం రుణమాఫీ చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. రైతుల మాదిరి తమకు కూడా సర్కారు మాఫీ చేస్తుందని నేతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అనేక మంది కార్మికులు నెలనెలా రుణ వాయిదాలు చెల్లించలేక పోతున్నారు. సర్కారు మాఫీ చేస్తుందని కొందరు.. డబ్బులు వెసులుబాటు కాక మరికొందరు సరిగ్గా చెల్లించడం లేదు.

### అన్నీ సరిగ్గా ఉన్నానో మనీ..

రుణాలు తీసుకున్న కార్మికుల పరిస్థితి ఇలా ఉంటే.. తీసుకోని వారికి సైతం సక్రమంగా డ్రా అవడం లేదు. ప్రభుత్వం సెప్టెంబర్ నుంచి చెక్కులను అందించింది. సుమారు రెండు నెలలు దాటినా అందరికీ డబ్బులు అందడం లేదు. బ్యాంకుల్లో చెక్కులు క్లియర్ చేయడం లేదు. తక్కువగా సిబ్బంది ఉన్నారని చెబుతూ జాప్యం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. సోమవారం ఆలేరు పట్టణంలో చేనేత కార్మికులు ఆందోళన కూడా చేపట్టారు. ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు డబ్బులు ఇప్పించాలని నేతన్నలు కోరుతున్నారు.

### వందల ఖాతాలు హోల్డ్..

జిల్లాలో సుమారు 11వేల మంది చేనేత కార్మికులు ఉన్నారు. వారికి సంబంధించి ఆయా గ్రూపులకు చేనేత, జౌళి శాఖ అధికారులు చెక్కులను అందించారు. కార్మికులు నెలనెలా చెల్లించినా డబ్బులకు తోడు సర్కారు సాయం కలిపి ఒక్కొక్కరికి సుమారు రూ. 2లక్షల వరకు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. కానీ జిల్లాలో వందలాది మంది ఖాతాలను బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టారు. ఆయా కార్మికుల డబ్బులు విత్ డ్రా చేసుకోకుండా ఫ్రీజింగ్ చేశారు. ఒక్క పోచంపల్లి పట్టణంలోనే కెనెరా బ్యాంకులో సుమారుగా 100, ఏపీజీబీవీలో 100మందివి నగదును హోల్డ్‌లో పెట్టారు. ఎంత నగదు పెండింగ్ ఉందో అంత హోల్డ్‌లో పెట్టి.. మిగతా డబ్బులు మాత్రమే రిలీజ్ చేస్తున్నారు. కాగా, వారంతా గతంలో నూలు కోసం కోసం ముద్ర తదితర రుణాలు తీసుకున్నారని, నెలనెలా ఈఎంఐలు కట్టడం లేదని, అందుకే హోల్డ్‌లో పెట్టామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. దాంతో అనేకమంది చేనేత కార్మికులు నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పైసలు ఎందుకు రావడం లేదని ఆరా తీస్తూ నిరాశగా వెనుదిరిగి వెళ్తున్నారు. ఇటీవల తమ డబ్బులు ఇప్పించాలని చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యార్‌కు వినతి పత్రం కూడా అందించారు.

## ఎస్‌బీఐ ఎదుట చేనేత కళాకారుల ధర్నా




ఆలేరులో ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న చేనేత కళాకారులు

ఆలేరు టౌన్, నవంబర్ 11 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన త్రిఫ్ట్ పథకం డబ్బులు అకౌంట్‌లో పడకపోవడంతో చేనేత కళాకారులు సోమవారం ఆలేరులోని ఎస్‌బీఐ సోమవారం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు పాశికంటి శ్రీనివాస్ డబ్బును అకౌంట్లలోకి జమ చేయడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రెండు నెలల నుంచి తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ రేపు, మాపు అంటూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, మేనేజర్ స్పందిస్తూ ఖాతాదారులు ఎక్కువ ఉండడం, బ్యాంకులో సరిపడా సిబ్బంది లేకపోవడం ఆలస్యమైందని, వారం రోజుల్లో జమ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో రచ్చ హనుమంతు, చింతకింది సత్యనారాయణ, కృష్ణ, గణేశ్, వెంకటేశ్, గుజ్జ పాండరి, వాసుదేవు పాల్గొన్నారు.

### బాకీ కింద పట్టుకున్నారు



నాకు పోచంపల్లిలోని కెనరా బ్యాంకులో లక్ష రూపాయలు బాకీ ఉంది. చేనేత పొదుప్ప కింద నాకు వచ్చిన లక్షా 15 వేల రూపాయలను బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టారు. బాకీ ఉన్నవ్ కాబట్టి అందులో జమ చేసుకున్నాం అంటున్నరు. నాలెక్కనే చాల మంది చేనేతన కార్మికులు డబ్బులు పెట్టుకున్నరు.

-భారత భూషణం, చేనేత కార్మికుడు, భూదాన్ పోచంపల్లి

### 40 వేలు ఆపిండ్రు



కుటుంబం అంతా కష్టపడి చేనేత పొదుపు పథకంలో పైసలు కట్టినం. ఏపీజీవీబీలో నాకు లోన్ ఉంది. త్రిఫ్ట్ కింద వచ్చిన డబ్బుల్లో 40వేలు నా బకాయి పట్టుకుని 70వేలు మాత్రమే ఇచ్చిండ్రు . స్కీం కింద వచ్చిన డబ్బులన్నీ ఇస్తారనుకున్నం. ఎవరికీ మొర పెట్టుకున్నా మాకు న్యాయం చేస్తలేదు.

- భారత బాలరాజు, చేనేత కార్మికుడు, భూదాన్ పోచంపల్లి